# వెలగని దీపం

"పగలల్లా తిరిగొస్తావ్. రాత్రిళ్ళు పొద్దు పోయే వరకూ వ్రాసుకుంటూ కూర్చుంటావ్ – ఎలారా అబ్బీ నీతో? ఇలా అయితే నీ ఆరోగ్యమేంగానూ?"

అనారోగ్యంతో మంచంలో వుండీ, ఆమె పరిస్థితిపట్ల ఆందోళన చెందటం పోయి తన గురించి ఆలోచిస్తూ పరామర్శిస్తున్న తల్లిని చూసి విస్తుపోయాడు రఘు.

కూర్చున్నవాడల్లా లేచి అలమరదాకా వెళ్ళి మందు సీసా అందుకున్నాడు.

సీసాలో మందు చమ్చాలోకి వొంపాలని రఘు చేసిన ప్రయత్నం విఫలమైంది.

"మందు నిన్ననే అయిపోయిందిరా! అయినా ఆరిపో బోతున్న దీపానికి ఇంకా చమురెందుకు? గ్లాసుతో కాసిని మంచినీళ్ళు పట్రా చాలు!" తడికె సందుల్లోంచి రఘు చర్యను గమనించిన పార్వతమ్మ అంది ఆయాస పడ్తూనే.

రఘు కళ్ళు చమర్చేయి!

కనుల కొలుకుల్లోంచి జాలువారిన కన్నీటి బొట్లు రఘు చేతిలో వున్న చమ్చాలో పడ్డాయ్.

మందు వుండాల్సిన చమ్చాలో కన్నీరుంది – మందు కున్న విలువ, శక్తి కన్నీటికి వుంటే – ఎందరో నిర్భాగ్యుల అనారోగ్యాలు సరి అయ్యేవి. విలువలేని తన కన్నీటికీ అశక్తతకూ సిగ్గుపడ్డాడు.

*　　*　　*　　*

వద్దంటున్నా వినకుండా పరాయి వాళ్ళ ఇళ్ళలో చాకిరీ చేసి కొడుకుని ఎం. ఏ., దాకా చదివించింది పార్వతమ్మ.

సుఖం అనే మాట ఎరక్కపోగా, తన కళ్ళ ఎదుటే తల్లి పస్తులుండి చేసిన త్యాగం జన్మ జన్మలకీ మర్చిపోలేడు.

చదువు పూర్తయి రెండేళ్లు దాటినా వుద్యోగం దొరక్కపోవటం దురదృష్టం.

రేపు మళ్ళీ ఇంటర్వ్యూకెళ్ళాలి! అందుకు డబ్బు కావాలి! ఎట్లా?

సమస్య!

రోడ్డుమీద నడుస్తున్న రఘు మస్తిష్కంలో ఒక వైపు తీరని ఆలోచన. మరోవైపు తీవ్రమైన ఆకలి!

నడుస్తున్న రఘు కాళ్ళకు బ్రేకులు పడ్డాయ్.

ప్రభుత్వ ఆస్పత్రి ప్రహరీ గోడకు వేలాడుతున్న 'రక్త నిధి' బోర్డు కన్పించింది.

నవ్వుకున్నాడు: ఆ నవ్వు పేలవంగా వున్నా, ముఖంలో సంతోషం పురివిప్పింది!!

* * * *

ఎయిర్ కండిషన్డు ఛేంబర్లోకి అడుగుపెట్టేడు. మెత్తటి ఖరీదైన సోఫాల్లో అయిదుగురు వ్యక్తులు కూర్చున్నారు. బహుశ ఆఫీసర్లు అయివుంటారు.

అందరికీ వినయ పూర్వకంగా విష్ చేశాడు.

"మీ పేరు?"

"మీరేం చదువుతున్నారు??"

"మీ వయసెంత???"

జవాబు చెప్పేందుకు కూడా అవకాశం ఇవ్వకుండానే తలా ఒక ప్రశ్న విసిరేరు.

"మిస్టర్! మాట్లాడరేం??"

ఏం మాట్లాడాలి?? వాళ్ళ ప్రశ్నలకు జవాబులు వాళ్ళ ముందున్న తన అప్లికేషన్లోనే వున్నాయి – అయినా అడిగేరు.

"మీ రేక్లాసు?" అయిదో ఆఫీసర్ ప్రశ్న వేశాడు.

"ఫస్ట్ క్లాస్!" అదీ అప్లికేషన్లోనే వుంది. అయినా చెప్పాడు గర్వంగా.

"అది కాదయ్యా! బేక్వర్డా – ఫార్వర్డాని" నొసలు చిట్లించి అయిదుగురూ ముక్త కంఠంతో అడిగేరు.

"బేక్వర్డే!" – ఒక్క కమ్యూనిటీలోనే కాదు. డబ్బులో, హోదాలో, గౌరవంలో, అధికారంలో, అదృష్టంలో, అన్నిటిలో తను బాక్వర్డే!

అయిదుగురిలో ఏ ఒక్కరూ తాను చదువుకున్న సబ్జక్టు గురించిగానీ, ఇవ్వబోయే వుద్యోగానికి సంబంధించిన ప్రశ్నగానీ అడగలేదు.

"యస్ — యుకెన్ గో"

వెళ్ళబోయిన వాడల్లా రెండడుగులు వేసి ఆగేడు. అందరి ముఖాల్లోకీ దీనంగా చూశాడు.

ఈ ఉద్యోగమైనా వస్తుందన్న ఆశతో నెత్తురు అమ్ముకుని మరీ వచ్చాడు.

* * * *

రైలు దిగిన రఘు కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరేడు.

ఇంట్లోకి అడుగు పెట్టగానే – ఎగశ్వాస దిగశ్వాసతో బాధపడ్తున్న తల్లి కన్పించే సరికి మనిషి నీరైపోయాడు.

"ఎలా వుందమ్మా?"

నిన్ను చూడకుండానే కన్ను మూస్తానేమోనని భయపడ్తున్నానురా! నువ్వొచ్చావుగా – ఇక నాకేం దిగుల్లేదు. నువ్వెళ్ళిన పనేమైందీ?"

"ఈసారి ఉద్యోగం తప్పకుండా వస్తుంది"

ఆ మాట తల్లి ఓదార్పు కోసమే అన్నాడా అన్పించింది.

మాయదారి ఆయాసమూ, దగ్గూ కాకుండా – రాత్రి నుంచీ గుండెలో నొప్పికూడా ఆరంభమైంది!"

బాధతో మెలికలు తిరిగిపోతూ మాట్లాడలేకపోతోంది పార్వతమ్మ.

ఇక ఇంట్లో వుంచుకుంటే లాభం లేదన్పించింది. ఎలాగైనా ఆస్పత్రిలో చేర్పించాలి!

జేబు తడివి చూచుకున్నాడు – ఒక రూపాయి నోటు, మరి కొంత చిల్లరా కన్పించింది.

ఒక్క అంగంలో రోడ్డు మీది కొచ్చి రిక్షా బేరం చేశాడు.

కేజువాలిటి ముందాగింది రిక్షా.

బండిలోంచి దిగాలని పార్వతమ్మ చేస్తున్న ప్రయత్నం వృధా అన్పించటంతో 'స్ట్రెచ్చర్' తెప్పించాడు రఘు.

వెంటనే ఇంజక్షనిచ్చారు. పరీక్షలన్నీ ఒక దాని తర్వాత మరొకటి పూర్తి చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చాక మరేమీ దిగుల్లేదు అని అనుకోకుండా, "చూడండీ! మీరు వెంటనే వెళ్ళి ఈ మందులు పట్రండి. హాస్పిటల్లో స్టాకు లేదు" అనేసి ప్రిస్క్రిప్షన్ చీటి అందించాడు డాక్టర్.

ఆ మాట విన్న రఘుకి, తన వంట్లో మిగిలివున్న నెత్తురుకూడా ఇగిరి ఆవిరై పోయిందాన్పించింది.

చీటీ అందుకొని వార్డులోంచి బైటికొచ్చాడు.

చేతిలో ప్రిస్క్రిప్షన్ అయితే వుందిగానీ – జేబులో డబ్బు లేదు.

మందులు కావాలి! తేవాలి!! ఎట్లా?!?

ఏమిటీ పరీక్ష? భగవాన్! నన్నెందుకు పుట్టించావు? ఇంతటి నిస్సహాయుడిగా ఎందుకు తయారుచేశావ్?' లోలోపలే గొణుక్కున్నాడు.

అమ్మను తానిప్పుడు ఎలాగైనా బ్రతికించుకోవాలి! ఎట్లా?

డిగ్రీ తనకెట్లాగూ తిండి పెట్టలేకపోయింది. కానీ, ఇన్నేళ్ళుగా తనకు అన్నం పెట్టిన అమ్మ అమృతహస్తం దూరం కాకూడదు.

అందుకోసం ఏం చేయాలి? ఏం చేయటానికైనా సిద్ధంగా వున్నాడు!

ప్రక్కనే వున్న ఫామిలీ ప్లానింగ్ వార్డు గోడమీది 'ఎర్ర త్రికోణం' గుర్తు అవుపించింది.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ డాక్టర్ దగ్గర కెళ్ళాడు.

"డాక్టర్! నేను నిరుద్యోగిని. పెళ్ళయింది. పైగా అయిదుగురు పిల్లలు. అందుకనీ..."

తల్లి నెలాగైనా బ్రతికించుకోవాలనే ఆరాటంలో, జీవితంలో ఘోరమైన అబద్ధం చెప్పేడు.

కేసు రెడీ చెయ్యమని నర్సుకి చెప్పాడు డాక్టర్!

రఘు ధ్యేయం, లక్ష్యం, సర్వస్వం అమ్మే!

అందుకే తనను తాను అర్పించుకుందుకైనా సిద్ధపడ్డాడు. తండ్రి కావాలనే ప్రకృతి సిద్ధమైన కోర్కెను కూడా చంపుకుని ఇంతటి త్యాగానికి ఒడిగట్టేడు.

* * * *

ఆపరేషన్ పూర్తయింది!

డబ్బూ, పంచెల చాపూ అందించాడు డాక్టర్.

డబ్బు చేతికొచ్చేసరికి బాధను సైతం మర్చిపోగలుగు తున్నాడు.

గేటు దాటి రోడ్డుమీదికొచ్చి రిక్షా ఎక్కాడు.

ఊరంతా తిరిగినా డాక్టరు వ్రాసిచ్చిన మందులు దొరకలేదు.

వట్టి చేతులతో హాస్పిటల్ చేరుకుని వార్డు కేసి నడిచాడు.

అది నడక కాదు — పరుగు.

శారీరకమైన బాధతో నడవలేక పోతున్నప్పటికీ, అమ్మ పరిస్థితెలా వుందోనసే ఆదుర్దా అతని బాధను మర్చిపోయేట్టు చేస్తోంది.

"యువార్ లేట్ మిస్టర్! ఆఖరి క్షణాల్లో కూడా మిమ్మల్నే తల్చుకుంటూ కన్ను మూసింది....." డాక్టర్ ఎదురై చెప్పేడు.

[డిసెంబరు 77 విజయ మాస పత్రిక]